విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 03, ఏప్రిల్ 2023

అభివృద్ధికి రాయలసీమ సాగునీటి సాధన సమితి కృషి

విశాలాంధ్ర - నంద్యాల : రాయలసీమలో అన్ని రంగాల అభివృద్ధికి రాయలసీమ సాగునీటి సాధన సమితిని అభివృద్ధి పరుస్తామని, ప్రజల విశ్వసనీయత, ఆదరణ, అభిమానాలే రాయలసీమ సాగునీటి సాధన సమితికి కొండంత అండ అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి పదకొండవ వార్షికోత్సవం నంద్యాలలోని త్రినేత్ర గెస్ట్ లైన్ నందలి పప్పూరి రామాచర్యుల ప్రాంగణంలో ఉపాధ్యక్షులు వై.యస్.రెడ్డి అధ్యక్షతన జరిగింది. వార్షికోత్సవ సదస్సుకు రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాల నుండి ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో ఆవిర్భావమైన రాయలసీమ సాగునీటి సాధన సమితి రాయలసీమ సహజ వనరులు, హక్కులు, తదితర అంశాలపై సంపూర్ణ సమాచారం శోధించి, ఆ విషయా లపైన రాయలసీమ ప్రజలకు పలు రూపాల్లో, ప్రధానంగా ప్రత్యక్ష సమావేశాలతో అవగాహన కల్పించి వారిని చైతన్యపరిచే దిశగా అడుగులు వేయించడంలో విజయవంత మయిందని సగర్వంగా ప్రకటిస్తున్నామన్నారు. చైతన్యవంతమైన రాయలసీమ ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన గావించి రాయల సీమకు దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయాన్ని సభ్య సమాజం ముందుంచడంలో విజయవంత మయ్యామన్నారు. సదస్సు ప్రారంభం ముందు రాయలసీమ సాగునీటి సాధన సమితి 2012సంవర్సరం నుండి ఇప్పటి వరకు చేపట్టిన అనేక కార్యక్రమాల గురించి ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సమావేశంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉమ్మడి చిత్తూరు ప్రతినిధులు మాగంటి గోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాము, కడప జిల్లా ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, గుర్రప్ప, వెంకటసుబ్బయ్య, ఏరువ రామచంద్రారెడ్డి, ఉప్పలపాటి బాలీశ్వరరెడ్డి, కొండారెడ్డి, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ గౌస్, న్యాయవాది, సామాజిక కార్యకర్త రామకృష్ణారెడ్డి, వివిధ మండలాల నుంచి రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : వైయస్ఆర్సిపి కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని అవుకు జడ్పిటిసి సభ్యురాలు, దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి సతీమణి చల్లా శ్రీలక్ష్మీ అన్నారు. మండలంలోని రూపనగుడి గ్రామానికి చెందిన వైఎస్ ఆర్సిపి కార్యకర్త నాగవర్ధన్ రెడ్డి ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి చికిత్స పూర్తిచేసుకుని ఇంటికి చేరుకున్న విషయాన్ని తెలుసుకున్న చల్లా శ్రీలక్ష్మి వారి గృహానికి చేరుకుని ఆదివారం పరామర్శించారు.ఆమె మాట్లాడుతూ పార్టీలకు కార్య కర్తలే బలమన్నారు. ఎప్పుడు ఏ సమయంలో అవసరమైన తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆమె వెంట చల్లా చైతన్యరెడ్డి, చల్లా చరణ్ కుమార్ రెడ్డి, చల్లా విక్రాంత్‌రెడ్డి,చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి, శ్రీమన్నారాయణ, పల్లె శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

పదో తరగతి మూల్యాంకనాన్ని బహిష్కరిస్తాం

విశాలాంధ్ర - నంద్యాల : ఉపాధ్యాయులను తహసిల్దార్ కార్యాలయాలలో ఉంచితే పదో తరగతి మూల్యాంకనాన్ని బహిష్కరిస్తామని ఎస్టియు నాయకులు హెచ్చరించారు. ఎస్టియు నంద్యాల జిల్లా కార్యాలయం నందు ఆదివారం ఎస్టియు జిల్లా అధ్యక్షులు ఆజాంబేగ్ మాట్లాడుతూ అంకిరెడ్డివల్లి ఉపాధ్యాయులను పదో తరగతి పరీక్షలలో మాల్ ప్రాక్టీస్ కారణంగా కేసులు బనాయించి జైలులో ఉంచితే న్యాయస్థానం ఆదేశాలతో గత 3నెలల తర్వాత సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగిందని, వారు చేయని తప్పుకు కుటుంబాలకు దూరంగా ఉండి ఇప్పటికే శిక్ష అనుభవిస్తున్నారని అన్నారు. కర్నూలు జిల్లా విద్యాశా ఖాధికారి 12మంది ఉపాధ్యాయులు పరీక్షలు జరిగే ప్రతిరోజు సంబంధిత తహసిల్దార్ కార్యాలయంలో పరీక్షలు ముగిసే వరకు ఉండాలని ఉత్తర్వులు ఇవ్వడం చాలా దుర్మార్గమన్నారు. కనుక ఈ ఉత్తర్వులను రద్దు చేయకపోతే రాబోయే 10వ తరగతి మూల్యాంకన విధులను బహిష్కరించటానికి ఎస్టీయు సంఘ పక్షాన పిలుపునివ్వ డానికి ఏమాత్రం వెనకంజ వేయమని తెలియజేశారు. ఈ సమావేశంలో ఎస్టీయు రాష్ట్ర సహాధ్యక్షులు ఎస్. చంద్ర శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇ.వీ. గోపాలకృష్ణ, రాష్ట్ర ప్రచార సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్రకుమార్, సీనియర్ నాయకులు ఎల్లసుబ్బయ్య, నరసింహారావు, ప్రసాదు, రంగస్వామి, శ్రీనివాసులు, తిరుపతయ్య, నాగేశ్వరెడ్డి, శేఖర్,గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర - మిడుతూరు : వీరభద్ర స్వామి, సుంకుల పరమేశ్వరి దేవి దివ్య ఆశీస్సులతో శ్రీరామనవమి, రంజాన్, గుడ్ ఫ్రైడే పండుగల సందర్భంగా మండల పరిధిలోని ఉప్పల్ దడియ గ్రామంలో రాష్ట్రస్థాయి ఆరు పండ్ల వృషభ రాజుల బండలాగుడు పోటీలను రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కమతం జయరాం రెడ్డి తెలిపారు. నాల్గవ తేదీ ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభిస్తామన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 40,000వేలు, రెండో బహుమతి 30,000వేలు, రూపాయలు మూడో బహుమతి 20,000 వేలు, నాలుగో బహుమతి 15,000, ఐదవ బహుమతి 10,000 ఆరవ బహుమతి 6,000 వేల రూపాయలు అందిస్తామని తెలిపారు. బహుమతి రాని ప్రతి కాడికి అదనంగా మూడు వేల రూపాయలు ఇవ్వనున్నట్లు అన్నదాన కార్యక్రమం పల్లె జ్ఞానాంధరెడ్డి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా కాటంమురళీధర్ రెడ్డి, మిడుతూరు మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, హాజరవుతారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే వారు రూ. 500 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు.

ప్రాత కోటలో తాగునీటి ఎద్దడి

విశాలాంధ్ర - పగిడ్యాల : మండల పరిధిలోని ప్రాతకోట గ్రామంలో 7,8, వార్డులలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఆదివారము కాలనీవాసులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు వేసవి రాకముందే ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే సంబంధిత అధికారులు ఈ విషయంపై పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని 6,7, వార్డు కాలనీలలో దాదాపు 60 ,70, ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారం రోజుల నుంచి ట్యాంక్ నుంచి సంబంధిత కాలనీలకు నీటి సరఫరా చేయకపోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయము గ్రామ సర్పంచికి సంబంధిత అధికారులకు విన్నవించిన ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు. తాగునీరు లేక సుదూర ప్రాంతాలకు వెళ్లి సైకిలు, బైకుల ద్వారా నీరు తెచ్చుకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో తాగునీరు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నా మని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - ప్యాపిలి : మండల పరిధిలోని రాచర్ల గ్రామం సమీపంలో వెలసిన లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయంలో ఈనెల రెండు నుంచి ఏడవ తారీకు వరకు లక్ష్మీ కంబగిరి స్వాముల బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ. నాగిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీ కంబగిరి స్వాముల బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని వారికి నీటి సమస్య తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పర్వదినం

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలో మట్టల పర్వదినాన్ని క్రైస్తవులు ఆది వారం ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా పెద్ద భోదనం సీఎస్ఐ చర్చిలో చర్చి ఫాదర్ రెవరెండ్ సంపత్ కుమార్ మట్టలాదివారం విశిష్టతను క్రైస్తవులకు వివరిం చారు. అనంతరం ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, ఈత మట్టలు, కొబ్బరి మట్టలు చేత పట్టుకొని గుడి ప్రదర్శన చేశారు. అనంతరం ఆయన క్రైస్తవులు ఉద్దేశించి ప్రసంగిస్తూ ఏసుక్రీస్తు 2000సంవత్సరాల క్రితం ఎరుషలేం పట్టణంలో మట్టల ఆదివారాన్ని ఆలనాటి ఇజ్రాయిల్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఎరుషలేం పురవీధుల గుండా యూదుల రాజా హోసన్నా జయం హోసన్నా జయం యూదుల రాజుకు జయం అంటూ నినాదాలు చేశారు. ఆనాటి నుండి నేటి వరకు మట్టలాదివారాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలు జరుపుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.అలాగే మండలంలోని ముత్యాల పాడు చర్చిలో చర్చి ఫాదర్ సంజీవరాజు, చాగలమర్రిలో రెవరెండ్ సంతోష్ కుమార్, పెద్దవంగలిలో రెవరెండ్ లాంబర్ట్, తోడేళ్లపల్లెలో ఐజక్ వరప్రసాదరావు, మద్దూరులో చిరంజీవి, ఫాదర్స్‌తో పాటు ఆర్సిఎం ఇతర ప్రైవేటు చర్చిల లో పండుగను ఘనంగా నిర్వహించారు. గొడిగనూరు, చిన్న వంగలి, నేలంపాడు, చిన్న భోధనం, బ్రాహ్మణ పల్లె, మల్లివేముల గ్రామాలలో పండుగను ఆయా సంఘ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు.

5 నుంచి మల్కి రహీం ఉరుసు

విశాలాంధ్ర - డోన్ రూరల్ : మండల పరిధిలోని మల్కాపురంలో 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు సయ్యద్ మల్కి స్వాముల ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. 5 వ తేదీన గంధం 6 వ తేదీన ఉరుసు 7 న కిస్తి 8వ తేదీన జార్తలు కార్యక్రమాలతో ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరుసు సందర్భంగా వివిధ పోటీలు : గ్రామంలో ఉరుసు సందర్భంగా 6వ తేదీ రాత్రి నాటక ప్రదర్శనలు 7వ తేదీ రాత్రి సినీ ఆర్కెస్ట్రా భక్తుల వినోదం కొరకు ఏర్పాటు చేశామని గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే 6వ తేదీన రాతి దూలం పోటీలు కూడా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

స్థానిక యువతకు ఉద్యోగా అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : రాంకో పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు స్థానిక యువతకు కంపెనీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి వి ఆర్ రామిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కనకాద్రి వల్లి గ్రామంలో బాధిత రైతులతో కలిసితన స్వగృహం నందు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడు గ్రామాల పరిధిలో రైతుల భూములపై వారికి తెలియకుండానే రాంకో పరిశ్రమ 2000 సంవత్సరంలో లీజు తీసుకోవడంతో విధిలేని పరిస్థితిలో 2007వ సంవత్సరం నుండి రైతులు భూముల అమ్ముకొని దగాపడ్డారన్నారు. పరిశ్రమ వస్తే తమ బతుకులు బాగు పడతాయని ఆనాడు రైతులు భూములు ఇచ్చారని, అయితే రాంకో ఏర్పడిన స్థానిక యువతకు రైతు కుటుంబాలకు ఉద్యోగాలు ఉపాధి కల్పించకుండా స్థానికేతరులకు ఉద్యోగాలు ఇవ్వడం ఎంతవరకు సబబు అన్నారు. సిఎస్ఆర్ నిధుల కింద గ్రామాలలో మౌలిక సౌకర్యాలుఅభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. రాంకో పరిధిలోని గ్రామాలలో డిప్లమా చేసిన నిరుద్యోగ యువకులకు ఒక్కొక్కరికి ప్రతి నెల 16,500 ఇవ్వాలని నిబంధనలు చెపుతున్న యాజ మాన్యం పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్థానికులకు 75% ఉద్యోగాలు ఇవ్వాలని చెప్తున్నా కంపెనీ బేఖాతార్ చేయడం గమనార్హమన్నారు. రాంకో మైనింగ్ వల్ల చుట్టుపక్కల గ్రామాలలో జల వాయు కాలుష్యం ఏర్పడంతో పాటు పర్యా వరణానికి తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉన్నదని యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. పర్యావరణన్ని కాపాడడంతో పాటు స్థానిక యువతకు రైతులకు తగిన న్యాయం చేయకుంటే బాధిత రైతులతో కలిసి న్యాయ పోరాటాలకు సిద్ధమవుతా మని హెచ్చరించారు. సమావేశంలో రైతులు మద్దిలేటి,ఎర్రన్న పెద్దన్న, రామ్మోహన్, ఓబులేసు, సర్పంచ్ రామలక్ష్మన్న పాల్గొన్నారు.

రామాపురంలో భారీ చోరీ

విశాలాంధ్ర - అవుకు : మండలంలోని రామాపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి అనగా తెల్లవారితే ఆదివారం అనగా దొంగలు పెద్ద ఎత్తున దొంగ తనానికి పాల్పడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మల్లు వెంకటేశ్వర రెడ్డి అలియాస్ నడిపెన్న కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శించుకోవడానికి శుక్రవారం అర్ధరాత్రి బయలుదేరి వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయం కావున ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి ఇంటిలోనికి ప్రవేశించి బెడ్‌రూమ్ వాకిలికున్న తాళాన్ని బద్దలు కొట్టి లోపలి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న 63తులాల బంగారు 14లక్షల నగదు ఎత్తికెళ్ళినట్లు పోలీసులు పేర్కొన్నారు. బనగానపల్లె సిఐ సుబ్బారాయుడు, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించి వివరాలను సేకరించారు. తెలుగుదేశం సీనియర్ నాయకుడు ఐవి పకీర రెడ్డి విషయం తెలుసుకొని బాధితుడు ఇంటికి వెళ్లి వెంకటేశ్వర్ రెడ్డిని ఓదార్చాడు. బాధితుడు మల్లు వెంకటేశ్వర రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెలిగించారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం : రామాపురంలో దొంగతనానికి పాల్పడిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంటి ఓనర్లు తమ ఇళ్లలో పెద్ద మొత్తంలో బంగారు గాని, నగదు గాని బ్యాంకుల్లో గాని, సేఫ్టీ లాకర్‌లోనే ఉంచు కోవాలని తెలిపారు. ఎవరైనా దూరప్రాంతా లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని అన్నారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ప్రజా సేవలో ఆత్మసంతృప్తి

విశాలాంధ్ర - నంద్యాల : రాజకీయాలకు కుల,మతాలకు అతీతంగా నంద్యాల ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో శిల్ప సేవా సమితి ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడం ఆ భగవంతుడు తమకు కల్పించిన అవకాశంగా, భాగ్యంగా భావిస్తున్నామని, ఆత్మసంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో 136మంది మహిళలకు 16 లక్షల 46వేల రూపాయల రుణాలకు సంబంధించి చెక్కులను బ్యాంక్ చైర్పర్సన్ నాగిని రవి సింగారెడ్డి, ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపించడం జరిగింది. గత 6నెలలుగా శిల్పా స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను వారుఅందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హలీల,మహిళలు పాల్గొన్నారు.

బీసీలు ఉన్నత స్థాయికి ఎదగాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : బీసీలు ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు పుంగనూరు రామచంద్రయాదవ్ అన్నారు. డోన్ బీసీ సంఘం నాయకులను వారి సొంత గృహాలలో కలుసుకున్న అనంతరం రామచంద్రయాదవ్ మాట్లాడుతూ బీసీ ఓట్లతో పలువురు నాయకులు గద్దెనెక్కు తున్నారని తెలిపారు. అంతేకాకుండా బీసీలను అటు ఉన్నత పదవులలో గాని రాజకీయ పదవులలో కానీ నియమించకుండా అనగ తొక్కుతున్నారని, రాబోయే ఎన్నికలలో బీసీలంతా ఐక్యమై పెత్తందారులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘం నాయకులు ఓబులాపురం ఎంపీటీసీ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు అంతా ఐకమత్యంతో ముందుకు వెళ్ళినప్పుడే రాష్ట్రంలో బీసీల ఐక్యత చాటినట్లు అవుతుందని తెలిపారు. ఈ పలువురు బీసీ సంఘం నాయకులు, ఓబులాపురం సర్పంచ్ రమణ యాదవ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మధన్, బీసీ సంఘం వడ్డెరవి రామ్‌కుమార్ యాదవ్,ఎంపిటిసి జానకి రాముడు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : వేసవి కాలంలో జిల్లా వ్యాప్తంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఎంపీడీవోలు అప్రమత్తమై నియోజవర్గంలోని అన్ని గ్రామాలలో త్రాగునీటి సమస్య లేకుండా చేయాలని బహుజన సమాజ్ పార్టీ నందికొట్కూరు అసెంబ్లీ ఇన్చార్జి ఎల్ స్వాములు అధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాములపాడు మండలం కొత్త బానకచెర్ల గ్రామంలో దాదాపుగా 8 నెలల క్రిందట ఇంటింటికి కుళాయి కనెక్షన్ కింద ప్రభుత్వం 23 లక్షలు మంజూరు చేశారన్నారు. అయితే ఆ టెండర్ను దక్కించుకున్న కాంట్రాక్టర్ సరైన సమయానికి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయదని తెలిసి కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదన్నారు. ఎస్సీ కాలనీకి దగ్గరనున్న బోరు లోతుగా ఉన్న సరిపడా పైపులు అధికారులు వెయ్యనందున కొద్దిసేపు మాత్రమే నీరు వస్తుందని ఆ నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నార నారణారు. గ్రామంలో నీళ్ల ట్యాంకు పెద్దగా లేకపోవడంతో నీరు సరిపోవడం లేదనీ అందులో కొంతమంది మోటర్లు వేయడం వలన కొన్ని కుటుంబాలకు నీరు అందడం లేదనారు. వీటన్నిటికీ కారణం ప్రభుత్వ అధికారుల వైఫల్యమని ఇంతకుముందు చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు వేయలేదని వేరే ఇతర కాంట్రాక్టర్లు కూడా పనులు చేయదానికి ముందుకు రాకపోవడానికి భయపడుతున్నారనారు. వీటికి కారణం ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన అన్నారు. కాబట్టి తొందరగా గ్రామంలో చేతిపంపులను రిపేర్ చేసి అలాగే పెద్ద ట్యాంకును పునర్ నిర్మించి ఉన్న బోరుకు మరిన్ని పైపులు వేసి గ్రామ ప్రజల దాహార్తి తీర్చాలని ఆయన అన్నారు. లేదంటే బానకచర్ల గ్రామస్తులను ఏకం చేసి ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ కురుమన్న ఏసన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

విశాలాంధ్ర - ఉయ్యాలవాద : స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో పదవ తరగతి విద్యనభ్యసిస్తున్న 14మంది విద్యార్థులకు ప్యాడు, పెన్నులు, సామాగ్రిని తన సొంత నిధులతో సంక్షేమ అధికారి నాగేంద్ర ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోను కాకుండా ప్రశ్నలకు జవాబులు రాయాలన్నారు. పరీక్షా కేంద్రంలో సమయం వృధా చేయకుండా తమకు తెలిసిన ప్రశ్నలన్నింటికీ ముందుగా సమాధానాలు రాయాలన్నారు. కార్యక్రమంలో గుళ్లదుర్తి వసతిగృహ సంక్షేమ అధికారి మురళి మద్దిలేటి, సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలకు ప్రాధాన్యత కల్పిస్తే టీడీపీ విజయఢంకా

విశాలాంధ్ర - నంద్యాల : రాయలసీమ జిల్లాల్లో అత్యధిక ఓటుబ్యాంకు కలిగిన బలిజ సామాజిక వర్గానికి వచ్చే ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తే తెలుగుదేశం పార్టీ విజయం నల్లేరు మీద నడకేనని నంద్యాలకు చెందిన టీడీపీ నేత, కాపు కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ వెదుర్ల రామచంద్రరావు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు వివరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్రంలోని కాపు, బలిజ నాయకులతో చంద్రబాబు సమావేశం నిర్వహించారు. నంద్యాల జిల్లా నుంచి టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు. రామచంద్రరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కాపు కార్పోరేషన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాల ద్వారా కాపు, బలిజలకు ఎంతో మంచి జరిగిందన్నారు. రాష్ట్రం లో వైసీపీ అధికారంలోకి వచ్చాక కాపు, బలిజ సామాజిక వర్గాలన్ని పూర్తిగా తొక్కి వేయబడ్డాయన్నారు. గతంలో కడప, చిత్తూరు జిల్లాల్లో టీడీపీ పార్టీ తరుపున బలిజ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం ఉన్న సంగతిని గుర్తు చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో బలిజ సామాజిక వర్గానికి ఉన్న బలమైన ఓటు బ్యాంకు దృష్ట్యా వచ్చే ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే స్థానానైనా కేటాయిస్తే ఆ ప్రభావం రాయల సీమలోని ఉమ్మడి అన్ని జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ వైపు బలిజ వర్గీయులంతా ఏకపక్షంగా మద్దతుగా నిలిచి పార్టీని విజయ పథం వైపు తీసుకువెళ్లడంలో ముఖ్య పాత్ర పోషిస్తారని చంద్రబాబుకు వివరించారు. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, ఏవీఆర్ ప్రసాద్‌లు సన్మానించారు.

కబడ్డీ పోటీల బహుమతులను ప్రధానం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధిలోని యనకండ్ల గ్రామంలో శ్రీరామనవమి పండగ పురస్కరించుకొని బనగానపల్లె మాజీ శాసన సభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి, వారి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి ఆధ్వర్యంలో 2 రోజుల నుండి గ్రామస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు శనివారం రాత్రి బిసి స్వగృహంలో మొదటి బహుమతిగా గణేష్ జట్టుకు 7000రూపాయలు, రెండో బహుమతిగా పవన్ జట్టుకు 5000రూపాయలు, మూడవ బహు మతిగా 3000రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిసి మదన్ భూపాల్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ తెలుగు యువత అధ్యక్షుడు బొబ్బల గోపాల్ రెడ్డి, గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె : మండల పరిధి పలుకూరు గ్రామం వడ్డేపేటలో వెంకటేశ్వర స్వామి మందిరం నిర్మాణం కొరకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 60000రూపాయలు విరాళంగా ప్రకటించి పర్సనల్ సెక్రెటరీ తిమ్మయ్య ద్వారా వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి చేతుల మీదుగా వడ్డేపేట గ్రామ పెద్దలకు అందించడం జరిగింది.

4న వైభవం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణంలో నిర్వహిస్తున్న బ్రహ్మచాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని కార్యక్రమ నిర్వాహకులు శివకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రథమనందీశ్వర దేవస్థానంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నాలుగో తేదీ మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రథమనందీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సభకు చాగంటి కోటేశ్వరరావు రావడం నంద్యాల ప్రజల అదృష్టమన్నారు. యోగా గురువు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా 50 వేల మంది హిందూ బంధువులతో ఓంకార మంత్రం జపించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నంద్యాల పేరు నమోదు చేసే బృహత్తర కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. నెరవాటి సత్యనారాయణ,కశెట్టి కృష్ణమూర్తి, పాలూరి సుబ్బారావు, మారం శేషయ్య, మోహన్ ప్రోగ్రాం మీడియా ఇంచార్జి చింతలపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా శంఖారావం పూరించండి

విశాలాంధ్ర - బ్యూరో కర్నూలు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్మిక వ్యతిరేక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు శంఖారావం పూరించండి వామపక్ష పార్టీల నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా నాయకులు బి.రామాంజనేయులు అధ్యక్షతన వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న విధానా లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు ఏప్రిల్ 14వ తేదీ నుండి 30తేదీ వరకు పాదయాత్రలు జిల్లాలో చేపడతామని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి కార్పొరేట్ మతోన్మాద విధానాలను ప్రజల్లో తీసుకెళ్తామని, ఆర్థిక విధానాలపై, అధిక ధరలు, నిరుద్యోగం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, జీఎస్టీ, అధిక ధరల ద్వారా ప్రజల పై పడుతున్న భారాలను ప్రజల్లోకి తీసుకెళ్తా మని, బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద వైఖరి, పౌరసత్వం, ఢిల్లీలో దాడులు, మతమార్పిడులు, మైనార్టీలపై, దళితులపై దాడులు చేస్తున్నదని వారు తెలిపారు. బిజెపి అవినీతి కుంభకోణాలు, రాఫెల్ కుంభకోణం, అదాని కుంభకోణం, న్యాయవ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నం చేయడం లాంటి అంశాలు రాజ్యాంగ వ్యవస్థను ధ్వంసం చేసే పద్ధతిలో బిజెపి అనుసరిస్తున్నదని వారు విమర్శిం చారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విభజన హామీలు విశాఖకు పరిశ్రమ ప్రైవేటు కరణ పోలవరానికి నిర్లక్ష్యం చేయడం కడప హుక్కు ఊసే ఎత్తకపోవడం రాజధాని నిర్మాణంపై రెండు నాలుకల ధోరణి అనుసరించడం లాంటి బీజేపీ విధానాలను ప్రజల్లోకి పాదయాత్రల ద్వారా తీసుకెళ్తామని వారు తెలిపారు. అలాగే పెట్రోల్ డీజిల్ వంట ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్ను చెత్త పన్ను విద్యుత్ చార్జీలు పెంచే అంశాలను కూడా ప్రజల్లోకి వివరిస్తామని వారు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఏకం కావాలని బిజెపికి వందన వాడుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటానికి సిపిఎం, సీపీఐ పార్టీలు చేపడుతున్న పాదయాత్రలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. అందులో భాగంగా రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సభలు పాదయాత్రలు నిర్వహిస్తామని ఆ సభల్లో పాదయాత్రలో ప్రజలు పాల్గొనాలని వారు తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రసూల్, జిల్లా నాయకులు జగన్నాథం, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నగరనాయకులు శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ యోగ ఫెస్టివల్ విజేతలకు అభినందన

విశాలాంధ్ర - కర్నూలు : నెల రోజులపాటు ఆన్లైన్ వేదికగా జరిగిన 1వ బెంగళూరు అంత ర్జాతీయ యోగా ఫెస్టివల్ లో భాగంగా రాష్ట్రం నుండి ప్రాతి నిధ్యం వహించిన పథకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను ఆదివారం కర్నూల్ అవుట్డోర్ స్టేడియంలో న్యాయవాది శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా యోగా సంఘం ఆధ్వర్యంలో కర్నూలు అవుట్డోర్ స్టేడియం సన్మాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 19దేశాల నుండి సుమారు 3500మంది క్రీడాకారులు పాల్గొన్న పోటీలలో జిల్లా క్రీడా కారులు ప్రాతినిధ్యం వహించి 6పతకాలు సాధించడం రాష్ట్రానికె గర్వ కారణం అన్నారు. అనంతరం జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి మార్చ్ 25 నుంచి 28 వరకు రాజస్థాన్‌లో జరిగిన 47వ జాతీయ స్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో ఉందరు 18-21 విభాగంలో పాల్గొని 6వ స్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారిని పి.లాలన ప్రియకు 2000రూపాయల నగదు ప్రోత్సాహక బహు మతిని అందజేస్తారు.జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, ఉపాధ్యక్షులు డాక్టర్ రమేష్, డాక్టర్ ముంతాజ్ బేగం,విజయ్ కుమార్, ప్రసన్న,ముని స్వామి, సుమంగళ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ యోగ ఫెస్టివల్‌లో విజేతల వివరాలు

20-25 మహిళల విభాగంలో ఎస్. ప్రసన్న మొదటి స్థానం. 8-10 సంవత్సరాల బాలికల విభాగంలో మనుశ్రీ (మూడవ స్థానం), కృష్ణప్రియ (5వ స్థానం), కేనిషా (అరవ స్థానం), 8-10సంవత్సరాల బాలురు విభాగంలో వి.చతుర్వేద(అరవ స్థానం),25-35 సంవత్సరాల పురుషుల విభాగంలో కే.ముని స్వామి నాలుగవ స్థానంలో నిలిచారు.

బస్సు షెల్టర్లు నిర్మించండి

విశాలాంధ్ర - హెూళగుంద : గజ్జిహల్లి క్రాస్ వద్ద బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రజలు ఆదివారం డిమాండ్ చేశారు. ప్రతిరోజు వ్యక్తిగత ప్రభుత్వ వాణిజ్య పనుల కోసం ఆదోని సిరుగుప్ప బళ్ళారి కర్నూలు తదితర ప్రాంతాలకు వెళతామని అయితే గజ్జిహల్లి క్రాస్ వద్ద బషల్టర్ లేక తీవ్ర ఇబ్బంది పడు తున్నామని ప్రజలు పేర్కొన్నారు. ఎలాంటి చెట్లు లేకపోవడంతో ఎండలోని ఎండుతూ వర్షాలో నానుతూ ప్రయాణిస్తున్నామని దీని ద్వారా అనారోగ్యా నికి గురవుతున్నామని ప్రజలు ఆరోపించారు. ఎలాంటి ఆశ్రయం లేక అడవిలో గంటలకు బస్సు కోసం నిలబడి ప్రయాణిస్తున్నామని ప్రజలు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వర్షాల్టర్ నిర్మిస్తే ఎంతో అనుకూల ంగా ఉంటుందని ప్రజలు విజ్ఞప్తి చేశారు. అలాగే పెద్ద హ్యట క్రాస్,నాగరకన్వీ క్రాస్ వద్ద నిర్మించాలని గ్రామ సర్పంచులు కోరారు.

ఎల్ఎల్సీ కాలువలో జలకళలాడుతున్న యువకులు

విశాలాంధ్ర - హెూళగుంద : మండలంలో ఆదివారం ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రజలు యువకులు ఎల్ఎల్సీ కాలువను జలకళలాడారు. ఎండల నుండి ఉపశమనం పొందడానికి కాలువలో ఈదుతూ యువకులు కేరింతలు కొట్టారు. ఆదివారం సెలవు రోజు కావడంతో విద్యార్థులు వీపు భాగానికి ఈత కాయ కట్టుకొని ఈత నేర్చుకున్నారు. ఎల్ ఎల్ సి కాలువ నిండుగా ప్రవహించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. పదో తేదీన నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు కాలువలో నీటి సరఫరా ఆగిపోతే కంకి దశలో ఉన్న వరిజొన్న పొదు తిరుగుడు పంట దెబ్బతింటుందని ఆయకట్టు రైతులు ఆరోపించారు. తాగునీటి అవసరాల కోసం ఆర్డబ్ల్యూఎస్ మరియు పంచాయతీ అధికారులు సమ్మత గేరి హెూళగుంద, గజ్జిహల్లి విరుపాపురం ఎస్ ఎస్ ట్యాంకులో నీటిని మళ్లించుకుంటున్నారు. ఏప్రిల్ వరకు కాలువలు నీటి సరఫరా ప్రవహించడం వల్ల త్రాగునీటికి సాగునీటికి ఇబ్బంది లేకుండా పోయిందని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కాలువ నీటి వల్ల పశు వులు మేకలు అడవి జంతువులకు నీటి దాహం తీరిందని పశువుల యజమానులు పేర్కొన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో కేవలం 7టీఎంసీల నీరు మాత్రం లభ్యతగా ఉన్నాయి. కాలువలో సమృద్ధిగా నీరు ప్రవహించ డం వల్ల ప్రజలు రైతులకు ఎలాంటి కష్టాలు ఏర్పడలేదు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్నతుంబలం, కల్లుకుంట, జాలవాడి, హెచ్ మురవణి, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పెద్దకడబూరులో సిఎస్ఐ చర్చి పాస్టర్ మనోహర్ బాబు ఆధ్వర్యంలో ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవ సోదరులు మట్టలు చేతబూని గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వ హిస్తూ హెూసన్న జయము, యూదుల రాజుకు జయం అంటూ నినాదాలు చేశారు. బస్టాండ్ ఆవరణంలో పాస్టర్ సందేశమిస్తూ లోక కళ్యాణం నిమిత్తం ఏసుక్రీస్తు మనుష్య కుమారునిగా పుట్టి, ప్రతి ఒక్కరి నిమిత్తం క్రీస్తు శ్రమలు పడి మానవాళికి పాప విముక్తి గావించారని తెలిపారు. సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

భక్తులతో కీటకటాలాడిన దేవరగట్టు

విశాలాంధ్ర - హెూళగుంద : మండల పరిధిలోని నేరణి కి దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి పూజారులు పసుపు బండారార్చన పంచామృత అభిషేకం రుద్రాభిషేకం మంగళ హారతి తో పూజించారు. భక్తులకు పూజారులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మాల మల్లేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి భజన పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

కథా వస్తువు ఎంపికలో డా.హరికిషన్ మేటైన రచయిత

విశాలాంధ్ర - కర్నూలు : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) గుంటూరు జిల్లా శాఖ వారు ప్రచురించిన డా.ఎం. "హరికిషన్ కథలు" అనే పుస్తకాన్ని ఆదివారం ఉదయం 11.00 గంటలకు స్థానిక లలితకళా సమితి సభా మందిరంలో అరసం అధ్యక్షుడు కలం ప్రహ్లాద అధ్యక్షత జరిగింది. ఈ పుస్తకావిష్కరణ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ రచయితలు పాలగిరి విశ్వప్రసాద్,తవ్వా ఓబుల్ రెడ్డిలు పాల్గొని ప్రసంగిస్తూ.. డా.. హరికిషన్ సామాజిక నేపథ్యంతో వస్తువును ఎంపిక చేసుకుని వాటిని కథలుగా మలచడంలో తనదైన శైలిలో రూపొందించుకున్నారని,వారి సాహిత్య కృషి ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని అందుకు ఆయన పట్టుదల అభినందనీయమని వారు తెలిపారు. అదేవిధంగా గౌరవ అతిథిగా హాజరైన జంధ్యాల రఘుబాబు, మూర్తుజాలు మాట్లాడుతూ..కర్నూలు రచయిత హరికిషన్ రాసిన మేలైన కథలను ఎంపిక చేసుకొని, అరసం రాష్ట్ర సమితి తరపున ఈ పుస్తకాన్ని ప్రచురించడం సంతోషించదగ్గ విషయమన్నారు. దీనికి సంపాదకులుగా అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ,ప్రధాన సంపాదకులుగా వల్లూరు శివప్రసాద్, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డిలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పత్తి ఓబులయ్య,డా. చంద్రమౌళిని,డా.హనుమంతప్ప, పుల్లా రామాంజనేయులు, వడకంద్ల మురళి, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటికీ చెక్కు చెదరకుండా ఉన్న రాతి కట్టడ బావి

విశాలాంధ్ర - హెూళగుంద : మండల పరిధిలోని నేరణికి తాండ పంచాయతీకి మజరా గ్రామమైన కొత్తపేటలో నిర్మించిన రాతి కట్టడబావి నేటికీ చెక్కుచెదం కుండా ఉన్నది ఎలాంటి ఆలనా పాలన లేకపోయినప్పటికీ బావి రాతి కట్టడంతో ప్రజలకు ఎంతో ఆకట్టుకుంటుంది. సిద్ది మసూద్ ఖాన హయాంలో నిర్మించిన బావిగా ప్రజలు గతంలో త్రాగునీటి అవసరాలుగా భావిని ఉపయోగించేవారు అలాగే రైతులు బావి నీటిని తోడుకొని వ్యవసాయ పంటలను పండించేవారు. దాదాపు 400ఏళ్ల నాటి బావి నేటికి రాతి కట్టడంతో ప్రజలకు దర్శనమిస్తుంది. రాతి కట్టడ బావిని ప్రజలు అంబరాన్ బావిగా పిలుస్తారు. బావి నిర్మాణం ఎప్పుడు జరిగింది ఎవరి హయాంలో నిర్మించినట్లు బావి కట్టడంలో శిలాఫలకాన్ని అప్పట్లో లిఖించారు. ఎంతో చరిత్ర కలిగిన బావిని అధికారులు సంరక్షించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర - కర్నూల్ సిటీ : కర్నూల్ స్థానిక మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సిలంబం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆదివారం ప్రముఖ గ్యాస్ట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకర్ శర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలంబం ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వలన బాల బాలికలకు ఆత్మరక్షణ కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం పెంపొందించడానికి ఈ క్రీడ వలన చురుకుగా చదువుల్లో ఉత్తీర్ణులు కాగలరు క్రీడలకు తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వగలన్నారు. అనంతరం క్రీడాకారులకు పండ్లు పలహారాలు పంపిణీ చేశారు ఉదయం 6నుండి 8గంటల వరకు శిక్షణ ఉంటుందని సిలంబం శిక్షకుడు బి రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిలంబం కార్యదర్శి బి మహావీర్ ఠాగూర్ సాయినాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

వాల్మీకుల గుండెల్లో చిరస్థాయిగా సీఎం జగన్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకుల గుండెల్లో చిరకాలం నిలిచిపోతారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం,నగర మేయర్ బి.వై. రామయ్య ఉద్ఘాటించారు. గత నెల 24న అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకి/బోయ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించి కేంద్ర ప్రభుత్వానికి పంపిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆదివారం కర్నూలులో తలపెట్టిన 'వాల్మీకుల మహాసభ'కు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి భారీగా వాల్మీకులు భారీగా తరలివచ్చారు.మంత్రి గుమ్మనూరు, మేయర్ బి.వై. రామయ్య, ఎమ్మెల్సీ అలంపూర్ మధుసూదన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్ర బోస్, వైసీపీ పంచాయతీ రాజ్ జోనల్ ఇన్‌చార్జ్ విరుపాక్షి హాజరయ్యారు. ముందుగా జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి శ్రీకృష్ణదేవరాయల కూడలి వరకు ర్యాలీగా వచ్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు నారయణ, గుమ్మనూరు శ్రీనువాసులు, తనయుడు ఈశ్వర్, నాయకులు మల్లికార్జున,ఎల్.వెంకటేశ్వర్లు,లక్ష్మణ్,లోకనాథ్ పాల్గొన్నారు. మంత్రి బైక్ ర్యాలీతో ఘన స్వాగతం : ఆలూరు నియోజకవర్గం నుంచి దాదాపు 200వాహనాలతో బయలుదేరిన మంత్రి గుమ్మనూరు జయరాంకు యువత భారీ బైక్ ర్యాలీతో నగరంలోకి ఘనస్వాగతం పలికారు. పెద్దపాడు నుంచి జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుని అనంతరం ర్యాలీగా వాల్మీకి విగ్రహం వద్దకు వెళ్లారు. **ఆస్పరి :** మైదాన ప్రాంతంలో ఉన్న వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలోకి చేర్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు చెప్పడానికి కర్నూలులో ఏర్పాటుచేసిన వాల్మీకి కృతజ్ఞత సభకు ఆస్పరి మండలం నుండి 50వాహనాలలో దాదాపు 500మందికి పైగా వాల్మీకులు ఆదివారం బయలుదేరారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని అంబేద్కర్ సర్కిల్లో సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, ఎంపిపి సుంకర ఉమాదేవి భర్త సుంకర రామాంజనేయులు, సొసైటీ సీఈవో అశోక్ నాయుడులు మాట్లాడుతూ గత నెల మార్చి 24వ తేదీన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ప్రాంతీయ వ్యత్యాసాన్ని తొలగించే విధంగా కేంద్రానికి పంపినం దుకు థాంక్యూ సీఎం సార్ అనే ప్రోగ్రాంని కర్నూలు పట్టణంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. ఎంపీటీసీ తిమ్మప్ప, మండల న్నాయకులు వెంకప్ప, అంజినయ్య,కౌలుట్ల,రాజన్నగౌడ్,నరసప్ప,అడ్వకేట్ రామాంజనేయులు, శ్రీరాము లు, శాంతప్ప, వీరేష్ వర్మ, రాజశేఖర్, శివ కోటి,వెంకటేష్,గోవర్ధన్, శ్రీకాంత్ నాయుడు నరసింహులు,రాజు, గ్రామాల వాల్మీకిలు వాహనాల్లో బయలుదేరారు.

విశాలాంధ్ర - హెూళగుంద : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ఆదివారం హెూళగుంద నుండి మండల అడ్వైజర్ బోర్డు కమిటీ సభ్యుడు కుమారస్వామి వాల్మీకి నాయకులు అనుమప్ప తోక వెంకటేష్ మల్లయ్య సిద్దయ్య వెంకటేష్ ఆధ్వర్యంలో వాల్మీకి సోదరులు భారీ సంఖ్యలో కర్నూలుకు తరలి వెళ్లారు. వాల్మీకి నాయకుడు కుమారస్వామి మాట్లా డుతూ వాల్మీకులు కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి వర్యులు గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు రాష్ట్ర అసెంబ్లీలో వాల్మీకులను ఎస్టీల జాబితాలలో తీర్మానం చేసినందుకు సిఎంకు వాల్మీకుల తరపున కృతజ్ఞత తెలిపారు. వైయస్సార్సీపి నాయకుడుమండల అడ్వైజర్ బోర్డు కమిటీ సభ్యుడు కుమారస్వామి అన్నారు. హెూళగుంద మండలం 50వాహనాల ద్వారా హెూళగుంద వాల్మీకి సర్కిల్ నుండి భారీ ఎత్తున కర్నూల్‌కు తరలి వెళ్లారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు.వాల్మీకి సోదరులు భారీ ఎత్తున పాల్గొన్నారు. మండలం లోని ఆయా గ్రామం నుండి వాల్మీకి సోదరులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : ఈనెల 14వ తేదీన భారత రాజ్యాంగ రూపకర్త బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి నుండి బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ తీరుకు వ్యతిరేకంగా,భారతదేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలను చైతన్యం చేయడానికి ఈనెల 14 నుండి 30 తేదీ వరకు పట్టణ వార్డులలో చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మిగనూర్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ,సీపీఐఎం ఆధ్వర్యంలో విలేకరుల సమా వేశం నిర్వహించడం జరిగింది.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి గాని మన హక్కులను సాధించు కోవలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, రాముడు, వెంకటరత్నం, బాలరాజు, శమిఉల్లా,సత్య న్న,అబ్దుల్లా, దాదా వాలి,లు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న విద్యుత్ కార్యాలయ భవనం

విశాలాంధ్ర - హెూళగుంద : హెూళగుంద విద్యుత్తు కార్యాలయ నూతన భవనం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పక్కా భవనం లేక గోడౌన్ లోనే అధికారులు విధులు పాటిస్తున్నారు గోడౌన్ ఇరుకుగా ఉండటం వల్ల పదిమంది రైతులు వస్తే నిలబడి తమ సమస్యను చెప్పవలసి వస్తుంది కనీసం కూర్చుని సమస్య తెలపానన్న ఇబ్బందిగా ఉండేది అని రైతులు తెలిపారు. పక్కా భవనం లేక అధికారులు రైతులు వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఏఈ ఓబులమ్మ మాట్లాడుతూ నూతన విద్యుత్ కార్యాలయ భవనము నిర్మాణానికి జిల్లా ఉన్నతాధికా రులు 19లక్షల రూపాయలు మంజూరు చేశారని అన్నారు. నూతన కార్యాలయం ఏర్పడితే అధికారులకు రైతులకు ప్రజలకు ఇబ్బంది తప్పుతా యని అన్నారు. అన్ని వసతులతో పక్కా భవనం నిర్మిస్తున్నారు. భవనం నిర్మాణ పనులు నాణ్యతగా నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుండిభవనం లేక గూడెంలో కొనసాగుతున్న విద్యుత్ కార్యాలయంకి నూతన భవనం నిర్మించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ధర ఘాతంతో పత్తి రైతు చిత్తు

విశాలాంధ్ర - దేవనకొండ : వేలాది రూపాయాలు పెట్టి పత్తి(తెల్లబంగారం) పంట సాగు చేస్తే ధర ఘాతంతో పత్తిరైతు చితైతున్నాడు. ఖరీఫ్ సీజన్ మొదట్లో పత్తి క్వింటం రూ.10 వేల ధర పలకడంతో రైతుల ఆనంధం ఆశలను రేకేతించింది.ప్రభుత్వం పంట మద్దతు ధర ప్రకటించ డంతో ధర రూ.10 వేల నుండి రూ.7వేలకు పడిపోయింది. దానికి తోడు సిసిఐ ,మార్కెట్‌లో ధళారులు కుమ్మకు కావడంతో రైతుల ఆశలపై నీళ్ళుచల్లారు. పంట కుడా మొదట్లో సాగు చేసిన రైతులకు దిగుబడి పర్వాలేదనిపించిన,తరువాత సాగు చేసిన రైతులు కనీసం పంటకుడా చేతికందలేదు.ధర రూ.7లోపు నిలిచిపోవడంతో ఏప్పుడైన పెరగకపోదా అనేఆశతో రైతన్న పంటను ఇళ్ళలోనే నిల్వ చేసుకోని ఆశగా ఎదురు చుస్తున్నాడు.ఈ ఏడాది అధిక వర్షాభావపరిస్థితుల వల్ల వెనుకనుండి సాగు చేసిన పత్తి రైతు దిగుబడిరాక నష్టాలను ముటకట్టుకున్నాడు. కనీసం పెట్టిన పెట్టుబడులు కుడా చేతికందకపోగా వచ్చిన అరకోర పంటను ఇళ్ళలోనే నిల్వచేసుకోవడంతో వచ్చిన నష్టం చోప్పుకోలేక లోలోన కుమిలిపోవడం జరుగుతుంది.ప్రభుత్వ నిర్ణయంతో పత్తి రైతు చిత్తుకావడం జరిగిందని పలువురు వాపోతున్నారు.వేలాది రూపాయాలు పెట్టి సాగు చేస్తే తెల్ల బంగారం తెల్లబోయేలా చేసిందని రైతు వాపో తున్నాడు. మండలంలో 17వేల హెక్టార్లులో సాగు చేస్తే దిగుబడి వచ్చిన పంట దాదాపు 60శాతం మేర రైతుల ఇళ్ళలోనే ఉంది.ధర రూ.10వేల పెరుగుదలతోనైన పత్తిరైతు క్షోభని గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని సగటు రైతు ఆవేధన.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని అటికెలగుండు క్రాస్ దగ్గర శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్టేకల్లు గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ పింజరి దాదావలి (45) మృతి చెందాడు. ఎస్ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం అట్టేకల్లు గ్రామానికి చెందిన టీవీ మెకానిక్ పింజరి దాదావలి ఆస్పరి కేంద్రంలో టివి మెకానిక్ షాప్ పెట్టుకుని జీవనం కొనసాగిస్తున్నాడని తెలిపారు. అయితే రోజు మాదిరిగానే రాత్రి టీవీ షాపును క్లోజ్ చేసుకుని అట్టేకల్లు గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యంలో అటికెలగుండు క్రాస్ దగ్గర బిల్లేకల్లు గ్రామం నుండి ఎదురుగా వస్తున్న ఆటో దాదావలి స్కూటర్‌ను ఢీ కొనడంతో కాలు విరిగిపోయి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ జానీవాకర్, హెూంగార్డు కాజ 100 పోలీస్ వాహనంలో వెళ్లి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 10:30 గంటల సమయంలో పింజరి దాదావళి మృతి చెందారు. మృత్యుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృత దేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య పింజరి కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వరప్రసాద్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై ఉద్యమాలు చేపడుదాం

విశాలాంధ్ర - పత్తికొండ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఉద్యమాలు చేపడుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు పిలుపునిచ్చారు. స్థానిక చదువుల రామయ్య భవనంలో సీపీఐ పత్తికొండ మండల సమితి సమావేశం పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేస్తున్నారని, మోడీ తప్పులను ఎత్తిచూపితే ప్రశ్నించిన వారిపై ఈడి, సీబీఐతో వేధింపులకు గురి చేయడమే అన్నారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై పార్లమెంటులో అనర్హత వేటు వేయడం సరైంది కాదన్నారు.దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగిస్తూ, సామాన్య మానవులు ఏమి కొనలేని విధంగా పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకీ పెంచుతూ పేద ప్రజలపై మరింత పెనుబారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్రమోడీ చేతిలో కీలుబొమ్మగా మారిపోయారని, రాష్ట్ర ప్రయోజనాలను ఏ మాత్రం పట్టించుకోకుండా మోడీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకు సీపీఐ, సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు చేపడు తామని తెలిపారు. జిల్లాలో వెనుకబడ్డ నియోజకవర్గాల అభివృద్ధికి, స్థానిక సమస్యల పైన దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. పార్టీ శ్రేణులు సమిష్టి నిర్ణయం, వ్యక్తిగత బాధ్యతతో సీపీఐ చేపట్టే ఉద్యమాలలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి పి.భీమలింగప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యులు కారన్న, తిమ్మయ్య, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, ప్రజా సంఘాలనాయకులు గురుదాస్,పెద్ద ఈరన్న, రంగన్న, నెట్టికంటయ్య, శాఖా కార్యదర్శులు రాజప్ప, జొహరాపురం కాశీ, భక్షాల ఈరన్న, ఏఐఎస్ఎఫ్ నాయకులు అల్తాఫ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.